క్లుప్తంగా

ఇరిగేషన్ ఇన్‌చార్జి డీఈఈగా చంద్రమౌళి


చంద్రమౌళి

ఉదయగిరి: జలవనరుల శాఖ ఉదయగిరి ఇన్‌చార్జి డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరుగా కందుకూరి చంద్రమౌళిని నియమిస్తూ సోమవారం ఆ శాఖ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన ప్రస్తుతం మండలంలోని గండిపాళెం జలాశయం ఏఈగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఈ మేరకు ఉన్నతాధికారులు డీఈఈగా అదనపు బాధ్యతలు అప్పగించారు.

భూముల రీసర్వేకు సహకరించాలి


మాట్లాడుతున్న తహసీల్దార్ సానా శ్రీనివాసులురెడ్డి

ఉదయగిరి: మండలంలోని తిరుమాలపురం, చాడేపల్లి, బండగానిపల్లి, పుల్లాయపల్లి గ్రామాల్లో జరుగుతున్న భూముల రీసర్వేకు రైతులు సహకరించాలని తహసీల్దార్ సానా శ్రీనివాసులురెడ్డి సోమవారం విలేకరులకు తెలిపారు. ఆయన మాట్లాడుతూ రెవెన్యూ సిబ్బంది రైతులకు నోటీసులు జారీ చేసే సమయానికి వారు వారి భూమి వద్దకు చేరుకుని భూములకు సంబంధించిన రిజిస్టర్ డాక్యుమెంట్లు, అగ్రిమెంట్లు పత్రాలు, డీ–ఫారం పట్టా, పట్టాదారు పాస్‌పుస్తకం, ఆధార్‌కార్డు జెరాక్స్, బ్యాంక్ పాస్‌బుక్, ఫొటోతో అందుబాటులో ఉండాలని ఆయన కోరారు.

నేటి నుంచి గడప గడపకు మన ప్రభుత్వం

చేజర్ల: గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం 10, 11 తేదీల్లో చేజర్ల మండలంలోని మడపల్లి సచివాలయ పరిధిలో జరుగుతుందని ఎమ్మెల్యే కార్యాలయ ప్రతినిధులు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొంది. సాయంత్రం 4 గంటల నుంచి జరిగే ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి పాల్గొంటారని తెలిపారు. కార్యకర్తలు, అధికారులు పాల్గొనాలని కోరారు.

పాఠశాలలకు ఎలక్ట్రానిక్ బెల్స్ వితరణ


ఆత్మకూరు పాఠశాలలో ఇందిరమ్మను సన్మానిస్తున్న దృశ్యం

ఆత్మకూరు: పట్టణంలోని జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న మల్లిక ఇందిరమ్మ తాను పనిచేస్తున్న పాఠశాలతో పాటు పట్టణం, మండలంలోని మరికొన్ని ప్రభుత్వ పాఠశాలలకు సోమవారం ఎలక్ట్రానిక్ గంటలను బహూకరించారు. ఆమె తమ కుటుంబ సభ్యుల జ్ఞాపకార్థంతో ఈ గంటలను అందజేస్తున్నట్లు తెలిపారు. ఆమెను ఎల్ఆర్‌పల్లి ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు అభినందించి సన్మానించారు. త్వరలోనే మండలంలోని మరికొన్ని పాఠశాలలకు ఎలక్ట్రానిక్ గంటలను అందజేయనున్నట్లు ఇందిరమ్మ తెలిపారు.

ఇన్‌చార్జి ఏఈగా బాలినేని ప్రవీణ్‌కుమార్


బాలినేని ప్రవీణ్‌కుమార్

సీతారామపురం: పంచాయతీరాజ్ మండల ఇన్‌చార్జి ఏఈగా బాలినేని ప్రవీణ్ కుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన గత నాలుగేళ్లుగా బసినేనిపల్లి సచివాలయంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండల పంచాయతీ రాజ్ ఏఈగా ఆయన బాధ్యతలు స్వీకరించారు. విధులపై అంకితభావంతో పని చేసి ఉన్నతాధికారులు తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా పని చేస్తానన్నారు.

అర్జీదారులకు భోజన ప్యాకెట్ల పంపిణీ



కావలి: తమ సమస్యల పరిష్కారం కోసం ఆర్డీఓ కార్యాలయానికి వచ్చే అర్జీదారులకు రెడ్‌క్రాస్ ద్వారా సోమవారం మజ్జిగ, భోజనం ప్యాకెట్లు, మంచినీటి బాటిళ్లు పంపిణీ చేశారు. రెడ్‌క్రాస్ చైర్మన్ డి రవిప్రకాష్ మాట్లాడుతూ సోమవారం రెడ్‌క్రాస్ సభ్యుడు, రక్తదాత పర్వతరెడ్డి వేణుగోపాలరావు సహకారంతో ఈ సేవా కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సిబ్బంది పద్మావతి, మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు వరం ఆరోగ్య సురక్ష


చేజర్ల మండలం నెర్నూరులో ఆరోగ్య సురక్ష వైద్య పరీక్షల బుక్‌లెట్ అందజేస్తున్న వైద్యాధికారిణి, జేసీఎస్ కన్వీనర్ పూనూరు బాలగంగాధర్ రెడ్డి, ఎంపీడీఓ ఎస్‌కే కరిముల్లా, గ్రామసర్పంచ్ కొమ్మల నరసయ్య, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుబ్బరత్నమ్మ తదితరులు


కలిగిరి: కృష్ణారెడ్డిపాళెంలో కంటి వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు


నువ్వూరుపాడు వైద్య శిబిరంలో రోగులకు మందుల కిట్‌లు పంపిణీ చేస్తున్న అధికారులు, నాయకులు

• డీఎంహెచ్‌ఓ పెంచలయ్య

ఆత్మకూరు రూరల్: ప్రతి ఒక్కరి ఆరోగ్య రక్షణ కోసం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం వరంలా ఉపయోగపడుతుందని డీఎంహెచ్‌ఓ పెంచలయ్య అన్నారు. మండలంలోని నువ్వూరుపాడు సచివాలయం వద్ద సోమవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాన్ని ఆయన సందర్శించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఆరోగ్య సేవలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఐసీడీఎస్ ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అంతకుముందు ఎంపీడీఓ ఐజాక్ ప్రవీణ్, స్థానిక నాయకుడు గడ్డం శ్రీనివాసులు రెడ్డి, తదితరుల ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు చేయించుకున్న రోగులకు మందులతో కూడిన కిట్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఈఓఆర్‌డి ఉషారాణి, ఏఓ శ్రీనివాసరావు, మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ దేవానంద్, డాక్టర్ అనూషా, పరిశీలకులు కాకూరు నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


ఆత్మకూరురూరల్(మర్రిపాడు): చుంచులూరులో జగనన్న ఆరోగ్య సురక్ష సేవలపై వివరిస్తున్న పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ గోపీనాథ్, ఎంపీడీఓ పరిమి నాగమణి, సచివాలయం కన్వీనర్ విష్ణుకుమార్‌రెడ్డి, పరిశీలకుడు గాలిబోయిన రామ్మోహన్


అనంతసాగరం మండలం లింగంగుంటలో వైద్య పరీక్షల బుక్‌లెట్ అందజేస్తున్న ఎంపీపీ పెయ్యల సంపూర్ణమ్మ, ఎంపీడీఓ మధుసూదన్‌రావు, వైఎస్సార్‌సీపీ నాయకులు రాఘవరెడ్డి, బాలకృష్ణారెడ్డి, ఉపసర్పంచ్, సుబ్బారెడ్డి తదితరులు


అల్లూరు : మండలంలోని పురిణిలో వైద్య సేవలను పరిశీలిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు


కొండాపురం: వైఎస్సార్ కంటి వెలుగు ద్వారా వచ్చిన కంటి అద్దాలు పంపిణీ చేస్తున్న సర్పంచ్ యారవ అంకమ్మ, గుడవల్లూరు సొసైటీ డైరెక్టర్ మన్నం వెంకటసుబ్బయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు యడ్లపల్లి వెంకటరమణయ్య తదితరులు

పట్టా భూమి కబ్జాపై ఫిర్యాదు


తహసీల్దారు ఆనంద్‌రావుకు వినతిపత్రం అందజేస్తున్న ప్యారేజాన్ కుటుంబ సభ్యులు

ఆత్మకూరురూరల్ (మర్రిపాడు): మర్రిపాడు మండలం డీసీపల్లిలో నాలుగు తరాలుగా వంశపారంపర్యంగా తమకు సంక్రమించిన పట్టా భూమిని కొందరు దురాక్రమణ చేయడానికి అడ్డదారుల్లో ప్రయత్నాలు చేస్తున్నారని షేక్ ప్యారేజాన్, తహసీల్దారు ఆనంద్‌రావుకు తమ కుటుంబ సభ్యులతో కలిసి సోమవారం వినతిపత్రం అందజేశారు. సర్వే నంబరు 170/1లో 80 సెంట్లు విస్తీర్ణంలోని భూమి తమకు వారసత్వంగా సంక్రమించిందన్నారు. ఈ భూమిలో తమ పూర్వీకులు చనిపోయినప్పుడు సమాధి చేశామన్నారు. 2016లో 67వ నంబరు జాతీయ రహదారి విస్తరణలో ప్రభుత్వం సేకరించిన స్థలానికి తమకు పరిహారం కూడా ఇచ్చారన్నారు. తమ పిల్లల చదువులు, ఉద్యోగాల కోసం ప్రస్తుతం తాము కడపలో నివాసం ఉంటుండగా, కొందరు తప్పుడు అర్జీలు ఇచ్చి అధికారులను తప్పుదారి పట్టిస్తున్నారని, తమకు తెలియకుండానే సోమవారం ఆ స్థలంలో కంపచెట్లు నరికి ఫెన్సింగ్ రాళ్లు ఏర్పాటు చేశారని ఆ వినతిపత్రంలో పేర్కొన్నారు. విచారించి తగు చర్యలు తీసుకుంటామని తహసీల్దారు హామీ ఇచ్చారు.

రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు చేజర్ల విద్యార్థులు


రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో పీడీ

చేజర్ల: బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో జూనియర్ బాలుర విభాగంలో చేజర్ల జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన తోడేటి రమణయ్య, ఆర్.రుత్విన్, జూనియర్ బాలికల విభాగంలో పి.జాహ్నవి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆ పాఠశాల హెచ్‌ఎం పి.హైమావతి సోమవారం తెలిపారు. ఈ కార్యక్రమంలో పీడీ మల్లికార్జునరావు, ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

సొంతింటి కలను నిజం చేసుకోండి


గృహ లబ్ధిదారులతో మాట్లాడుతున్న తహసీల్దారు నాగరాజు

సంగం: రాష్ట్ర ప్రభుత్వం పేదలందరికీ ఇళ్లు పథకం ద్వారా అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి ఇంటి స్థలాలను మంజూరు చేసిందని, ఇళ్ల నిర్మాణాలకు సహాయ సహకారాలు కూడా అందిస్తుందని ప్రతి ఒక్కరూ సొంతింటి కలను నిజం చేసుకోవాలని తహసీల్దారు నాగరాజు అన్నారు. సోమవారం మండలంలోని పెరమనలో నిర్మాణంలో ఉన్న జగనన్న ఇళ్లను పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణాలను త్వరగా ప్రారంభించి పూర్తి చేసుకోవాలని సూచించారు. గృహ నిర్మాణశాఖ అధికారులు నిత్యం పర్యవేక్షిస్తుంటారని, ఏ సమస్య ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఆయన వెంట హౌసింగ్ ఏఈ కరిముల్లా, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

ఉత్సాహంగా చలో విజయవాడ


సమావేశంలో మంత్రి కాకాణితో పాటు ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి


దగదర్తి ఎంపీపీ ప్రసాద్‌నాయుడుకు కిట్ అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: విజయవాడలో సోమవారం జరిగిన వైఎస్సార్‌సీపీ విస్తృత సమావేశానికి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని ముఖ్య నాయకులు భారీ ఎత్తున తరలి వెళ్లారు. ఎమ్మెల్యే స్వయంగా పాస్‌లు అందజేయడంతో నాయకులు నేరుగా సమావేశ ప్రాంగణానికి చేరుకున్నారు. 'ఆంధ్రప్రదేశ్‌కు జగన్ ఎందుకు కావాలంటే...' అనే కిట్‌లను పార్టీ నాయకులకు ఎమ్మెల్యే అందజేశారు. కావలి నియోజకవర్గం నుంచి తరలి వెళ్లిన నాయకులు ఎన్నికల్లో 175కు 175 స్థానాలు గెలుచుకుంటామని ప్లకార్డులు ప్రదర్శించి అందరిని ఆకట్టుకున్నారు.

ఉత్సాహంగా తరలిన వైఎస్సార్‌సీపీ నాయకులు

ఆత్మకూరు: వైఎస్సార్‌సీపీ కేంద్ర కమిటీ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చే ఎన్నికల దశా నిర్దేశం కార్యక్రమానికి ఆత్మకూరుకు చెందిన వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, పార్టీ ముఖ్య నాయకులు ఉత్సాహంగా తరలివెళ్లారు. ఆత్మకూరు మున్సిపాలిటీతో పాటు ఆరు మండలాల జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, మండల పార్టీ కన్వీనర్లు, జేసీఎస్ మెంబర్లు, మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్ చైర్మన్లు పాల్గొన్ని ప్లకార్డులు ప్రదర్శించారు.


విజయవాడలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న ఆత్మకూరు వైఎస్సార్‌సీపీ నాయకులు

అర్జీల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు

సంగం: జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో భాగంగా ప్రజలు అందజేస్తున్న వినతుల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తహసీల్దారు నాగరాజు అన్నారు. సోమవారం సంగం ఎంపీడీఓ కార్యాలయంలో జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని నిర్వహించి మండలంలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజల వద్ద నుంచి అర్జీలు స్వీకరించారు. ఆయా శాఖల అధికారులకు ఆ వినతులను అందజేసి వెంటనే పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని తీసుకున్నారు. రాష్ట్ర, జిల్లా స్థాయి అధికారులకు జగనన్నకు చెబుదాం కార్యక్రమం ద్వారా వచ్చే అర్జీలను పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేశారని, వినతులు అందజేసిన ప్రజల సమస్యలను పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ జ్యోతిలక్ష్మితో పాటు వ్యవసాయాధికారి శ్రీహరి, హౌసింగ్ ఏఈ కరిముల్లా, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నా మట్టి.. నా దేశం అవగాహన ర్యాలీ



వరికుంటపాడు: నా మట్టి.. నా దేశం కార్యక్రమంలో భాగంగా సోమవారం వరికుంటపాడులో ఎంపీడీఓ చేవూరు శ్రీదేవి ఆధ్వర్యంలో మట్టి కలశాల ర్యాలీ నిర్వహించారు. మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల నుంచి సేకరించి తెచ్చిన మట్టిని ఎంపీడీఓ కార్యాలయంలో సంప్రదాయబద్ధంగా ఓ కలశంలో నింపి ప్రత్యేక అలంకరణ చేసి ప్రజా ప్రతినిధులు, అధికారులు, సిబ్బంది కలిసి ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ సీనియర్ సహాయకులు సీతారామాంజనేయులు పాల్గొన్నారు.

సిమెంట్ రోడ్డు పనుల ప్రారంభం


సిమెంట్ రోడ్డు పనులను ప్రారంభించిన ఎంపీపీ పెయ్యల సంపూర్ణమ్మ

చేజర్ల(సోమశిల): అనంతసాగరం మండలం దేవరాయపల్లి బిట్–1లో సిమెంట్‌రోడ్డు పనులను ఎంపీపీ పెయ్యల సంపూర్ణమ్మ సోమవారం ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి సహకారంతో ఈ రోడ్డు పనులు చేపట్టినట్లు తెలిపారు. సుమారు రూ.20 లక్షల నిధులతో దేవరాయపల్లి బిట్–1 లోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ప్రాంతాలకు ఈ రోడ్లు వేస్తున్నట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్ తిరుపతి, ఈశ్వరయ్య పాల్గొన్నారు.

వైద్య శిబిరం ప్రారంభం


వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న దర్గా ఈఓ

అనుమసముద్రంపేట: హజరత్ నాయబ్ రసూల్ దర్గా గంధమహోత్సవం సందర్భంగా దర్గా ప్రాంగణంలో సోమవారం వైద్య శిబిరాన్ని వక్ఫ్‌బోర్డు అధికారి హుస్సేన్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ దర్గాకు గంధమహోత్సవం సందర్భంగా సుదూర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో వస్తుంటారని, అత్యవసర సమయంలో వారికి వైద్యం అందించేందుకు ప్రభుత్వం ఏఎస్‌పేట పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దర్గాకు వచ్చిన భక్తులు దర్గా ప్రాంగణంలోని వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు జిలానీ, వైద్య సిబ్బంది ఫణీంద్రరెడ్డి, యు శ్రీనివాసులు, రసూల్, ఏఎన్‌ఎంలు, ఆశ వలంటీర్లు పాల్గొన్నారు.

శౌర్య జాగరణ రథయాత్ర


శివాలయం వద్ద రథానికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు

ఉదయగిరి: విశ్వహిందూ పరిషత్ భజరంగ్ దళ్ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి ఉదయగిరిలో శౌర్య జాగరణ రథయాత్ర నిర్వహించారు. విశ్వహిందూ పరిషత్ జిల్లా కార్యదర్శి యనమల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ వీహెచ్‌పీ స్థాపించి ఆరు దశాబ్దాలు గడిచిందన్నారు. వచ్చే ఏడాది జనవరిలో అయోధ్యలో జరిగే విగ్రహ ప్రతిష్టపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన


విద్యార్థిని అభినందిస్తున్న ఎంపీపీ సంపూర్ణమ్మ

చేజర్ల(సోమశిల): ఫార్మేట్–2 పరీక్షల్లో విజయం సాధించిన అనంతసాగరం మండలం లింగంగుంట ఎస్సీ పాఠశాల విద్యార్థులను ఎంపీపీ పెయ్యల సంపూర్ణమ్మ సోమవారం అభినందించారు. 1 నుంచి 5వ తరగతి వరకు ప్రథమ శ్రేణి మార్కులు సాధించిన విద్యార్థులను ఆమె అభినందించారు. చక్కగా చదువుకుని ఉన్నత చదువులు చదవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓలు బాలకృష్ణారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, సీఆర్‌ఎంటి మాధవ్ పాల్గొన్నారు.

క్రమశిక్షణతో విద్యాభివృద్ధి సాధించాలి

• బి శ్రీనివాసులు రెడ్డి, ఐఎఫ్ఎస్ ఆఫీసర్


ఆత్మకూరు బాలికల పాఠశాల విద్యార్థినులకు పలు విషయాలు వివరిస్తున్న శ్రీనివాసులు రెడ్డి

ఆత్మకూరు: విద్యార్థుల లక్ష్యం నిర్దేశించుకుని క్రమశిక్షణతో మెలిగినప్పుడే విద్యాభివృద్ధి సాధించి ఉజ్వల భవిష్యత్‌ను ఏర్పాటు చేసుకోవాలని ఐఎఫ్ఎస్ అధికారి (ప్రధాన మంత్రి కార్యాలయంలో అసిస్టెంట్ సెక్రటరీ) బి శ్రీనివాసులురెడ్డి అన్నారు. ఆయన ప్రభుత్వ పాఠశాలలను సందర్శిస్తూ ఆ పాఠశాలల పనితీరు, విద్యార్థులకు బోధన, తదితర అంశాలను పరిశీలనలో భాగంగా సోమవారం పట్టణంలోని జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. విద్యార్థులతో మమేకమై మాట్లాడారు. పలు పాఠ్యాంశాలను గురించి ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. అనంతరం పాఠశాల విద్యార్థులు అందరిని ఒక చోట చేర్చి మాట్లాడుతూ విద్యార్థి దశలోనే అనేక అంశాలపై ఆసక్తి కనబరుస్తూ అవగాహన పెంచుకోవాలన్నారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను గుర్తెరిగి ఆ మేరకు క్రమశిక్షణతో మెలగాలన్నారు. విద్యకు ఏది అవరోధం కాదని, నైతిక విలువలు పాటిస్తూ విద్యను అభ్యసించాలన్నారు. మంచి మార్గంలో పయనిస్తూ ఉన్నత శిఖరాలు చేరాలని తద్వారా తల్లిదండ్రులకు, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలన్నారు. తాను ఉపాధ్యాయుడిగా పని చేశానని, 2009లో ఐఎఫ్ఎస్‌లో సీటు సాధించానని తెలిపారు. రచయితగా 'ప్రణమామి' అనే గ్రంథాన్ని రాసి అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించినట్లు శ్రీనివాసులురెడ్డి తెలిపారు. పాఠశాల హెచ్‌ఎం కోటేశ్వరమ్మ, ఉపాధ్యాయులు శ్రీనివాసులు, జనార్దన్‌రెడ్డి, తదితర ఉపాధ్యాయులు ఐఎఫ్ఎస్ అధికారి శ్రీనివాసులురెడ్డిని ఘనంగా సన్మానించారు.

గర్భిణులు తగు జాగ్రత్తలు తీసుకోవాలి


కిట్‌ను అందజేస్తున్న క్లబ్ సభ్యులు, వైద్య సిబ్బంది


గర్భిణులకు పరీక్షలు నిర్వహిస్తున్న కరీష్మా

వరికుంటపాడు: మండలంలోని గర్భిణులు కాన్పు అయ్యేంత వరకు తగు ఆరోగ్య జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యాధికారిణి కరీష్మా అన్నారు. ఆమె సోమవారం స్థానిక వైద్యశాలల్లో ప్రధాన మంత్రి మాతృత్వ సురక్ష యోజన పథకం కింద గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆమె వారికి బీపీ, షుగర్, స్కానింగ్ తదితర పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించారు. గర్భిణులు పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాలు తీసుకోవాలన్నారు. అనవసరంగా స్కానింగ్ పరీక్షలు చేయించుకోవద్దన్నారు. అంగన్‌వాడీల ద్వారా అందించే పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రభుత్వ వైద్యశాలలో కాన్పు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్యులు ఆయేషా, పీహెచ్ ఎన్.సుశీలమ్మ సిబ్బంది పాల్గొన్నారు.

గర్భిణులకు కిట్స్ పంపిణీ

అల్లూరు: స్థానిక ప్రభుత్వాస్పత్రిలో అల్లూరు వాసవీక్లబ్ ఆధ్వర్యంలో దాతలు మొగళ్లపల్లి నాగేశ్వరరావు, దొంతంశెట్టి సురేష్, నగేష్ గర్భిణులకు మందుల కిట్లను పంపిణీ చేశారు. అనంతరం ఆస్పత్రికి వచ్చిన రోగులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. క్లబ్ సభ్యులను ఆస్పత్రి సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు అభినందించారు. కార్యక్రమంలో వాసవీ క్లబ్ ప్రెసిడెంట్ మద్దాలి సురేష్, సెక్రటరీ ఎం.సురేష్, ట్రెజరర్ పి.శ్రీనివాసులు పాల్గొన్నారు.

బహుజనులను ఏకం చేసిన కాన్షీరామ్


కాన్షీరామ్‌కు నివాళులర్పిస్తున్న బీఎస్పీ నాయకులు

ఆత్మకూరు: బహుజన సమాజ్ పార్టీ వ్యవస్థాపకుడు కాన్షీరామ్ 17వ వర్ధంతిని బీఎస్పీ ఆధ్వర్యంలో ఆత్మకూరులో సోమవారం నిర్వహించారు. పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ అధ్యక్షుడు నందా ఓబులేసు ఆధ్వర్యంలో కాన్షీరామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బడుగు, బలహీన వర్గాలను ఏకతాటిపై తెచ్చేందుకు దేశంలోనే పెద్ద రాష్ట్రమైన ఉత్తర ప్రదేశ్‌లో బీఎస్పీని అధికారంలోకి తెచ్చేందుకు కాన్షీరామ్ చేసిన కృషిని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు టి.కృష్ణ, ధర్మయ్య, రజనీ, పలు మండలాల పార్టీ నాయకులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయండి


సీపీఎం పాదయాత్రకు స్వాగతం పలుకుతున్న నాయకులు

ఆత్మకూరు: ఆత్మకూరు నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కె అజయ్‌కుమార్ కోరారు. సీపీఎం చేపట్టిన పాదయాత్ర సోమవారం ఆత్మకూరులోకి ప్రవేశించింది. పాదయాత్రకు స్థానిక పార్టీ నాయకులు ఘన స్వాగతం పలికారు. పట్టణంలోని మున్సిపల్ బస్టాండ్ ప్రధాన వీధులు మీదుగా సాగిన పాదయాత్ర పార్టీ కార్యాలయం వద్దకు చేరుకుంది. అజయ్‌కుమార్ మాట్లాడుతూ నియోజకవర్గంలో పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు నారంపేట వద్ద ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు చేశారని, అయితే ఇప్పటికీ ఒక్క పరిశ్రమ నెలకొల్పలేదన్నారు. కేంద్ర ప్రభుత్వం విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేట్ సంస్థలకు అమ్మేందుకు ప్రయత్నించడం దారుణమని మండిపడ్డారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు డేవిడ్‌రాజు, జి.లక్ష్మీపతి, షేక్ సందానీ, కృష్ణప్రసాద్, ఐద్వా నాయకురాలు గుల్జార్ బేగం, కొండా లక్ష్మమ్మ, గద్దర్ బాబు పాల్గొన్నారు.

ఆటోను ఢీకొన్న బైక్ : ఇద్దరికి తీవ్రగాయాలు



క్షతగాత్రులు అంకయ్య, సుబ్రహ్మణ్యం

ఆత్మకూరురూరల్ (మర్రిపాడు): మర్రిపాడు సమీపంలో అల్లంపాడు క్రాస్ రోడ్డు వద్ద 67వ నంబరు జాతీయ రహదారిపై ప్రయాణిస్తున్న బైక్ ఎదురుగా ఆటోను ఢీకొన్న ఘటన సోమవారం రాత్రి జరిగింది. బైక్‌లో ప్రయాణిస్తున్న ముగ్గురిలో ఇద్దరు తీవ్ర గాయాలపాలయ్యారు. వీరు మద్యం మత్తులో ఉన్నట్లు స్థానికులు తెలిపారు. అనంతసాగరం మండలం అగ్రహారానికి చెందిన అంకయ్య, సుబ్రహ్మణ్యంలకు కుడి వైపు కాలు విరిగాయని స్థానికులు తెలిపారు. 108 వాహనానికి ఫోన్ చేయడంతో ఈఎంటీ షేక్ షిక్బతుల్లా, పైలట్ ఎస్.శ్రీనివాసులు క్షతగాత్రులను హుటాహుటిన ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్య చికిత్స కోసం వారిని నెల్లూరుకు తరలించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.